# అల్లాహ్ తఆలాను నమ్ముకొనుట గురించి
# మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవితం ఆధారంగా గొప్ప ఆదర్శం

**హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 25.09.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ۔ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

గత కొన్ని ఖుత్బాలలో నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రలోని ఉన్నత మైన నమ్మక స్థానాన్ని వివరిస్తూ వచ్చాను.

ఈ కాలంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం శ్రేష్ఠ దాసుడైన హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శానికి అనుగుణంగా దానిని మన కోసం ఏ విధంగా వివరించారు, ఏమి నేర్పించారు, దానిపై ఎలా ఆచరించి చూపారనే విషయంపై ఈ రోజు కొన్ని విషయాలు ప్రస్తావిస్తాను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విధంగా ఉపదేశించారు. తవక్కుల్ (అల్లాహ్‌పై నమ్మకం పెట్టుకోవడం) అంటే ఏదైనా ఒక కార్యం సిద్ధింపజేసుకోవడానికి అల్లాహ్ తఆలా ఏర్పరిచిన సాధనాలను మీ శక్తిమేరకు సమకూర్చుకుని, ఆ తర్వాత ఓ దేవా! దీని పరిణామాన్ని శుభప్రదం చేయమని ప్రార్థనలలో నిమగ్నమవ్వడమే. ఈ సాధనాలను కూడా నాశనం చేసి, తలకిందులు చేయగల వందలాది ఆపత్తులు, వేలాది ఆపదలున్నాయి. వాటి బారి నుండి మమ్మల్ని రక్షించి, మాకు నిజమైన విజయాన్ని ప్రసాదించి, మా లక్ష్య స్థానానికి చేర్చు అని వేడుకోవడమే తవక్కుల్.

మనిషి సాధనాలను ఉపయోగిస్తాడని, అయితే ఏ సాధనాలపై ఐతే మనం ఆధారపడతామో, అవి కూడా నాశనమైపోయే ప్రమాదాలు మరియు పరిస్థితులు ఏర్పడగలవని హుజూరె అన్వర్ స్పష్టం చేశారు. అందువల్ల అల్లాహ్ తఆలా మనల్ని వాటి దుష్ప్రభావాల నుండి రక్షించాలని అతని సహాయాన్ని అర్థించవలెను. ఈ మార్గాన్ని అనుసరించడం ద్వారానే ఒక విశ్వాసి అల్లాహ్ తఆలా అనుగ్రహాలను పొందేవాడిగా మారగలడు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విధంగా ఉపదేశించారు. అల్లాహ్ తఆలా పట్ల సంతోషంగా ఉండటం అందరి వల్ల అయ్యే పని కాదు. అది దేవునిపై భరోసా, పూర్తిగా దేవుని వైపే మొగ్గు చూపడం మరియు దేవుని ఆజ్ఞలకు లొంగిపోవడం యొక్క అత్యున్నత స్థానం. ఆ స్థాయికి చేరుకున్న తర్వాత మనిషికి తన ప్రభువుపై ఎలాంటి ఫిర్యాదు లేదా అసంతృప్తి ఉండదు. ఇక అల్లాహ్

తఆలా తన బానిస పట్ల సంతోషించడమనేది ఆ బానిస పరిపూర్ణ సత్యసంధత, విశ్వాసపాత్రత, అత్యున్నత స్థాయి పరిశుద్ధత, పవిత్రత మరియు పరిపూర్ణ విధేయతపై ఆధారపడి ఉంటుంది. దీనిని బట్టి అనుచరులు దైవజ్ఞానం మరియు ఆధ్యాత్మిక మార్గపు అన్ని దశలను పూర్తి చేశారని స్పష్టమవుతోంది. అనుచరులు అల్లాహ్ తఆలాతో సంబంధం, నమ్మకం విషయంలో ఏ అత్యున్నత స్థానాన్ని ఐతే సాధించారో, దాన్నే మనకు ఆదర్శంగా నిర్దేశించడమైనది.

హుజూర్ అలైహిస్సలాం తమను అనుసరించే వారికి సందర్భాన్ని బట్టి దేవునిపై భరోసా గురించి ఉపదేశిస్తూ ఉండేవారని హుజూరె అన్వర్ తెలియజేశారు. ఒక కథనంలో హజ్రత్ మాస్టర్ నజీర్ హుస్సేన్ రజియల్లాహు అన్హు ఈ విధంగా పేర్కొన్నారు. హుజూర్ అలైహిస్సలాం ఇలా ఉపదేశించారు: అల్లాహ్ తఆలా బలహీనుడని అనుకోవద్దు, అతడు అత్యంత శక్తిమంతుడు. మీరు ఏదైనా విషయంలో అతనిపై సంపూర్ణంగా ఆధారపడినప్పుడు, అతడు తప్పకుండా మీకు సహాయం చేస్తాడు. అతడు స్వయంగా పవిత్ర ఖుర్ఆన్‌లో ఆదేశించినట్లు: وَمَنۡ يَّتَوَكَّلۡ عَلَى اللّٰهِ فَهُوَ حَسۡبُهٗ అనగా మరియు ఎవరైతే అల్లాహ్‌పై భరోసా ఉంచుతారో, వారికి అల్లాహ్ మాత్రమే సరిపోతాడు.

సద్గుణ సంపన్నులైన ప్రజల లక్షణాలను వివరిస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విధంగా ఉపదేశించారు. ఒక స్థానం దేవునిపై సంపూర్ణ భరోసా కలిగిన స్థానం. దానిపై వారిని అత్యంత దృఢంగా నిలబెట్టడం జరుగుతుంది. ఆ స్వచ్ఛమైన ఊట ఇతరులకు ఎంతమాత్రమూ లభించదు. కేవలం వారి కోసమే అది ఆహ్లాదకరంగా, అనుకూలంగా మార్చబడుతుంది. దైవజ్ఞాన కాంతి వారిని ఎంతగా ఆదుకుంటుందంటే వారు తరచుగా ఎలాంటి వనరులు, సాధనాలు లేని స్థితిలో ఉన్నప్పటికీ, సాధారణ ఆధారాలకు తమను పూర్తి దూరంగా భావించినప్పటికీ, ఎంతో సంతోషంతో, ప్రశాంత మనస్సుతో జీవితాన్ని గడుపుతారు. వారి వద్ద వేలాది నిధులు ఉన్నాయా అన్నంత సంతోషంగా తమ రోజులను గడిపేస్తారు. వారి ముఖాల్లో సంపన్నపు తాజాదనం కనిపిస్తుంది, ధనవంతులకు ఉండే స్థిరత్వం గోచరిస్తుంది. ఇబ్బందులు, ఆర్థిక ఇబ్బందుల స్థితిలో కూడా వారెంతో ఉదారతతో, సంపూర్ణ నమ్మకంతో తమ దయామయుడైన ప్రభువుపై ఆధారపడి ఉంటారు.

హుజూరె అన్వర్ ఈ విధంగా తెలియజేశారు. అల్లాహ్ తఆలాతో సంబంధం ఉన్నప్పుడు, ఇబ్బందులు, కష్టాలలో కూడా అల్లాహ్ తఆలా పైనే నమ్మకం ఉంచుతారు గానీ అతనికి దూరం కారు. ఏమిటో అర్థం కావడం లేదు, ఇది ఆపత్తా, పరీక్షా లేక శిక్షా?' అనే ఆలోచన వారికి రాదు. అల్లాహ్ తఆలాపై పరిపూర్ణమైన నమ్మకం పెట్టుకొని, అల్లాహ్ తఆలా హక్కులను నెరవేరుస్తున్నట్లయితే, నిశ్చయంగా అల్లాహ్ తఆలా తన అనుగ్రహాలతో ముంచెత్తుతాడు.

హుజూర్ అలైహిస్సలాం ఈ విధంగా ఉపదేశించారు. అల్లాహ్ తఆలాపై భరోసా ఉంచేవారు, దేవుని వైపు మొగ్గు చూపే వారు ఎన్నటికీ వ్యర్థమైపోరు. కేవలం తన సొంత ప్రయత్నాలపైనే ఆధారపడి ఉండే మనిషికి అవమానం తప్ప మరి ఏమి లభిస్తుంది? ప్రపంచం సృష్టించబడినప్పటి నుండి అల్లాహ్ తఆలా నియమం ఇదే విధంగా వస్తోంది. ఎవరైతే లౌకిక ప్రపంచాన్ని విడిచిపెడతారో వారు దాన్ని పొందుతారు. ఇక ఎవరైతే దీని వెనుక పరుగెడుతారో వారు దీనికి దూరమవుతారు. దేవునితో సంబంధం లేని వ్యక్తులు కుతంత్రాలు, కపటత్వంతో కొన్ని రోజులు ఏమైనా సాధించినప్పటికీ, అది నిష్ప్రయోజనమే.

ఎందుకంటే చివరికి వారు ఘోరమైన వైఫల్యాన్ని చూడక తప్పదు. ఇస్లాంలో శ్రేష్ఠమైన వ్యక్తులుగా నిలిచినది ఎవరంటే ధర్మం ముందు లౌకిక ప్రపంచాన్ని అసలు లెక్కచేయని వారే.

హుజూరె అన్వర్ ఈ విధంగా తెలియజేశారు: దేవునిపై అసలు భరోసాయే లేనప్పుడు, ప్రతి ప్రతిజ్ఞలో మనం పునరుద్ఘాటించే ధర్మాన్ని లౌకిక ప్రపంచం కంటే గొప్పగా పరిగణిస్తాం అనే భావనే లేనప్పుడు ఇప్పుడు ఖుద్దాముల్ అహ్మదియ్య ఇజ్తిమా జరుగుతోంది, అందులో కూడా దీనిని పునరుద్ఘాటిస్తాం. అలాంటప్పుడు ఈ నమ్మకాలు, విశ్వాసంలో బలహీనత ఉన్నటువంటి వ్యక్తిని పరలోక అనుగ్రహాలకు కూడా దూరం చేస్తుంది. వారు ఈ ప్రపంచాన్నే సర్వస్వంగా భావించి, దానిని సాధించడానికే ప్రయత్నిస్తూ వచ్చారు. కొందరికి అది లభించింది, మరికొందరు దానిని పొందే ప్రయత్నంలోనే ఈ లోకం నుండి నిష్క్రమించారు, విఫలమయ్యారు. లేదా లభించినా అది నాశనమైపోయింది, ఆ తర్వాత లౌకికపరమైన వేదనలోనే తమ జీవితాన్ని గడిపారు. అటు ధర్మానికి చెందలేదు, ఇటు లోకానికీ చెందలేదు. దీని గురించే ఒక కవి ఈ విధంగా అన్నాడు: 'న ఖుదా హీ మిలా న విసాలె సనమ్!' (అనగా అటు దేవుడూ లభించలేదు, ఇటు ప్రియురాలి/ప్రపంచపు కలయికా దక్కలేదు!).

హుజూరె అన్వర్ ఈ విధంగా తెలియజేశారు: అల్లాహ్ తఆలా స్వయంగా హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంనకు ముతవక్కిల్ (దేవునిపై సంపూర్ణ భరోసా గలవాడు) అని పేరు పెట్టాడు. కనుక హజ్రత్ అలైహిస్సలాం ఈ విధంగా ఉపదేశించారు. మసీహ్ అవతరణకు సూచికగా ఆయన తన రెండు అరచేతులను ఇద్దరు దేవతల రెక్కలపై ఉంచి ఉంటాడని రాయబడింది. ఇది దేనికి సంకేతమంటే జ్ఞాన సాధనకు, ఆంతరంగిక ఆధ్యాత్మిక కాంతికి సాధనాలైన ఆయన కుడి, ఎడమ చేతులు ఆకాశ దేవతల మద్దతుపై ఆధారపడి ఉంటాయి. బుద్ధికి సంబంధించిన జ్ఞానాలు, ఆంతరంగిక కాంతులు మరియు ధర్మానికి సంబంధించిన ఆత్మ జ్ఞానాలు ఈ సాధనం ద్వారా, అంటే దేవతల సహాయంతో లభిస్తాయి. ఇద్దరు దేవతల రెక్కలపై చేతులు ఉంచడం వెనుక ఉన్న అర్థం ఇదే. ఆయన బాహ్య పాఠశాలలు, పుస్తకాలు లేదా ఆధ్యాత్మిక గురువుల నుండి కాకుండా, అల్లాహ్ తఆలా నుండే దేవుడు నేరుగా ప్రసాదించే జ్ఞానం పొందుతాడు. అలాగే ఆయన జీవిత అవసరాలకు కూడా దేవుడే సంరక్షకుడిగా, బాధ్యుడిగా ఉంటాడు. పదేళ్ల క్రితమే ముద్రించబడిన తన దైవవాణి గురించి హుజూర్ అలైహిస్సలాం పేర్కొంటూ: اِنَّكَ بِاَعْيُنِنَا سَمَّيْتُكَ الْمُتَوَكِّلَ وَعَلَّمْنٰهُ مِنْ لَّدُنَّا عِلْمًا అనగా నిశ్చయంగా నీవు మా కంటి ముందే ఉన్నావు. మేము నీకు 'ముతవక్కిల్' అని పేరు పెట్టాము మరియు మా తరఫున నీకు జ్ఞానాన్ని నేర్పించామని తెలిపారు.

ప్రార్థన (దుఆ) మరియు తవక్కుల్ గురించి హుజూర్ అలైహిస్సలాం ఈ విధంగా ఉపదేశించారు: ప్రతి చిక్కు ముడి దుఆ ద్వారానే విడిపోతుంది. మనం ఎవరికైనా మేలు చేయాలనుకుంటే మన చేతిలో ఏముంది? దేవుడు మనకు ప్రసాదించిన ప్రార్థన అనే ఒకే ఒక్క సాధనం మాత్రమే ఉంది. అది మిత్రునికైనా, శత్రువునికైనా సరే. మనం నలుపును తెలుపుగా, తెలుపును నలుపుగా మార్చలేము. దేవుడు తన అనుగ్రహంతో మనకు ప్రసాదించేది తప్ప, మన వశంలో ఒక్క అణువంత కూడా లేదు. దుఆల వైపు దృష్టి మళ్లిస్తూ, అల్లాహ్ తఆలాపై భరోసా పెంచుకోవాలని ఉపదేశిస్తూ హుజూర్ అలైహిస్సలాం ఈ విధంగా ఉపదేశించారు: ఆత్మశుద్ధి కోసం, సదాచరణలతో ముగింపు శుభప్రదంగా ఉండటం

కోసం, నైతిక కార్యాలు చేసే అనుగ్రహం పొందడం కోసం రెండవ మార్గం దుఆ. ఈ మార్గంలో అల్లాహ్ తఆలాపై ఎంతగా నమ్మకం, విశ్వాసం ఉంచుతాడో, అలిసిపోకుండా అడుగులు వేస్తూ ఉంటాడో, అంతగా ఉత్తమ ఫలితాలు, ఫలాలు లభిస్తాయి. అన్ని కష్టాలు తొలగిపోతాయి. ప్రార్థన చేసే వ్యక్తి భక్తిశ్రద్ధల అత్యున్నత స్థానానికి చేరుకుంటాడు.

హుజూర్ అలైహిస్సలాం నమ్మక అంశాన్ని వివరిస్తూ, ఆయన జీవిత చరిత్రకారుడు హజ్రత్ షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ గారు రజియల్లాహు అన్హు ఈ విధంగా రాశారు: కేసుల సిద్ధతలో హుజూర్ అలైహిస్సలాం పూర్తి కృషి, ప్రయత్నం చేసినప్పటికీ, ఆ బాహ్య సాధనాలపై ఆయన ఎన్నడూ ఆధారపడలేదు. బదులుగా ప్రార్థనలనే ఆశ్రయించేవారు. ప్రతి క్షణం అల్లాహ్ తఆలా ఉనికియే వారి (అ) కళ్లముందు ఉండేది. అతనే పూజనీయుడు, అతనే గమ్యస్థానం, అతనిపైనే పరిపూర్ణ భరోసా, విశ్వాసం ఉండేది.

హుజూర్ అలైహిస్సలాం తమ ఒక నిష్కల్మషమైన అనుచరునికి చేసిన ఒక ఉపదేశాన్ని గురించి హజ్రత్ సాహిబ్ జాదా మిర్జా బషీర్ అహ్మద్ గారు రజియల్లాహు అన్హు ఒక కథనంలో ఈ విధంగా పేర్కొన్నారు: హాఫిజ్ నూర్ ముహమ్మద్ గారు రజియల్లాహు అన్హు ఫైజుల్లా చక్ నివాసి నాకు లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ తాను హాఫిజ్ హామిద్ అలీ రజియల్లాహు అన్హు గారి నుండి ఈ కథనాన్ని విన్నట్లు చెప్పారు. హజ్రత్ మసీహ మౌఊద్ అలైహిస్సలాం ఇలా ఉపదేశించారు. ఏదైనా కేసు విషయంలో గానీ లేదా మరేదైనా సందర్భంలో గానీ న్యాయమూర్తి ముందుకు వెళ్లాల్సి వస్తే, వెళ్లేముందు ఏడుసార్లు అల్ ఫాతిహా అధ్యాయం చదవ వలెను మరియు ఏడుసార్లు తన వేలితో నుదుటిపై 'యా అజీజ్' అని రాసుకోవాలి. ఈ విధంగా చేయడం వల్ల అల్లాహ్ తఆలా విజయాన్ని ప్రసాదిస్తాడు. హజ్రత్ సాహిబ్‌జాదా మిర్జా బషీర్ అహ్మద్ గారు రజియల్లాహు అన్హు దీనిపై వ్యాఖ్యానిస్తూ ఇలా రాశారు: బహుశా దేవుడు తప్ప మరొకరితో సంబంధం లేని (ఇతరులపై ఆధారపడని) వైరాగ్య స్థితిని, అల్లాహ్‌పై పూర్తి భరోసా స్థితిని పెంపొందించడం కోసమే హుజూర్ అలైహిస్సలాం ఈ విధంగా ఉపదేశించి ఉండవచ్చు.

హుజూరె అన్వర్ ఖుత్బా ముగింపులో ఇలా అన్నారు: అల్లాహ్ తఆలాపై తవక్కుల్ ఉంచే విషయంలో హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంలో ఒక వినూత్నమైన, అద్భుతమైన స్థాయి కనిపిస్తుంది. తమ యజమాని (దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం) ను అనుసరిస్తూ ఆయన చూపిన ఈ ఆదర్శం మనకు ప్రతిచోటా గోచరిస్తుంది. అల్లాహ్ తఆలా మనందరిని కూడా తవక్కుల్ (నమ్మకపు) అత్యున్నత ప్రమాణాలను సాధించటకు అనుగ్రహించు గాక!

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ
اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ أَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ
وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِى الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ
وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -